క్లుప్తంగా

పేదలకు బియ్యం పంపిణీ



వృద్ధురాలికి బియ్యం అందజేస్తున్న పచ్చిరిపల్లి రాము

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చిరిపల్లి రాము తన సేవా కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం పేదలకు బియ్యం పంపిణీ చేశారు. వార్డులో సుమారు 25 మంది నిరుపేదలకు 5 కేజీల చొప్పున బియ్యం వారి ఇంటికి వెళ్లి అందజేశారు. గత నాలుగు సంవత్సరాలుగా తాను ఈ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

11 నుంచి కేరళ ఆయుర్వేద శిబిరం

దాబాగార్డెన్స్: ఆయుర్వేద పంచకర్మ విధానం ద్వారా దీర్ఘకాలిక రోగాలకు చికిత్స అందించేందుకు ఈ నెల 11 నుంచి 13 వరకు కేరళ ఆయుర్వేద శిబిరం నిర్వహించనున్నట్టు వైద్యరాజ్ ఔషధాలయ మేనేజర్ దినుప్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని రాంనగర్‌లో వైద్యరాజ్ ఔషధాలయంలో ప్రముఖ కేరళ వైద్యుడు డాక్టర్ కేఎం ఉన్నికృష్ణన్ నాయర్ 3 రోజుల పాటు ఈ కేంద్రంలో అందుబాటులో ఉంటారని తెలిపారు. డాక్టర్‌ను సంప్రదించాలనుకునేవారు అపాయింట్‌మెంట్ కోసం 9133106060, 9030568264 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు. రాంనగర్ జీవీఎంసీ అవుట్‌గేట్ ఎదురుగా గల వైద్యరాజ్ ఔషధాలయంలో ఈ సేవలు పొందవచ్చన్నారు.

కృష్ణా కళాశాలలో హిరోషిమా డే



హిరోషిమా డే గురించి వివరిస్తున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం: ప్రపంచ హిరోషిమా డేను మద్దిలపాలెం డాక్టర్ వీఎస్ కృష్ణా డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు మాట్లాడుతూ న్యూక్లియర్ పవర్‌ను శాంతియుతంగా ప్రజా ప్రయోజనాలకు ఉపయోగించాలన్నారు. దేశాల మధ్య శాంతియుత సంబంధాలు ఎంతైనా అవసరమన్నారు. హిరోషిమా బాంబు దాడి సంఘటనలతో కూడిన ఫొటో ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కె.వి.ఎస్.మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, తదితరులు పాల్గొన్నారు.

'సంఘం శరణం గచ్ఛామి' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం, అభ్యుదయ ఆర్ట్స్ (హైదరాబాద్) సంయుక్తంగా ప్రదర్శించనున్న సంఘం శరణం గచ్ఛామి–డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్ర నాటక ప్రదర్శన పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ నెల 9వ తేదీ సాయంత్రం 6 గంటలకు ఏయూ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ అసెంబ్లీ హాల్ వేదికగా ఈ నాటక ప్రదర్శన జరుగుతుందని పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి ఆచార్య పేటేటి ప్రేమానందం తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కిశోర్ బాబు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వి.ఆర్.రాజు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, డాక్టర్ జి.వీర్రాజు, డాక్టర్ జి.కె.డి.ప్రసాద్, డాక్టర్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యం పగ.. ట్రాఫిక్ సెగ



ఎల్‌ఐసీ వెనుక వైపు రహదారిలో రద్దీ

- దక్షిణలో పలు బిజీ సెంటర్లు
- అధిక వాహనాల వినియోగంతో పెరుగుతున్న కాలుష్యం
- అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ప్రజలు



సింగ్ హోటల్ జంక్షన్ నుంచి కాంప్లెక్స్‌కు వచ్చే రోడ్డులో ఇలా..

దాబాగార్డెన్స్: నగరం విస్తరిస్తోంది. మున్సిపాలిటీ గ్రేటర్‌గా అవతరించింది. గ్రేటర్ నుంచి స్మార్ట్‌సిటీ అయింది. ఇప్పుడు మెట్రోసిటీగా పరుగులు తీస్తోంది. పెరుగుతున్న జనాభాతో పాటు వాహనాల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. వేలల్లో ఉన్న వాహనాలు లక్షల్లోకి చేరాయి. ట్రాఫిక్ విపరీతంగా పెరగడంతో నగర రహదారుల్లో ఎక్కడికక్కడ పద్మవ్యూహం వంటి పరిస్థితి నెలకొంటోంది. వాహనాల నుంచి వెలువడే కాలుష్యం నగరవాసి జీవితాన్ని విషతుల్యం చేస్తోంది. శబ్ద కాలుష్యం సైతం అదే స్థాయిలో పెరుగుతోంది. ఉదయం నుంచి రాత్రి వరకు ప్రధాన కూడళ్లలో విపరీతంగా వాహనాల రద్దీతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ నిలిచిపోవడం నిత్యకృత్యంగా మారుతోంది.

నానా అవస్థలు..

ట్రాఫిక్‌లో ఓసారి ఇరుక్కుంటే మళ్లీ బయటపడటం తలకు మించిన పనవుతోంది. జగదాంబ జంక్షన్, పూర్ణామార్కెట్, దుర్గాలమ్మగుడి జంక్షన్, దాబాగార్డెన్స్ మెయిన్‌రోడ్డు, సీఎంఆర్ జంక్షన్ ఏరియా, జిల్లా పరిషత్ జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్ ఏరియా, ద్వారకానగర్ జంక్షన్‌లన్నీ దక్షిణ నియోజకవర్గంలో ఉన్నాయి. ఈ ప్రధాన జంక్షన్ల నుంచి తప్పించుకోవాలంటే కత్తిమీద సామే. ట్రాఫిక్‌ను తప్పించుకుని బయటపడాలంటే వాహన చోదకులకు చుక్కలు కనిపిస్తున్నాయి.

చుట్టుముట్టిన కాలుష్యం..

నగరం పెరిగిపోవడంతో జనాభా కూడా అదే రీతిన పెరుగుతోంది. నగర జనాభా సుమారుగా 25 లక్షలు పైబడి ఉండగా, లక్షలాది పైచిలుకు ప్రజలు ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు జరుపుతూ ఉంటున్నారు. దీంతో వాహనాల రద్దీ నానాటికీ పెరుగుతోంది. ముఖ్యంగా విశాఖ నగరంలో దక్షిణ నియోజకవర్గంతోనే నగర, జిల్లా పరిపాలన అంతా ముడిపడి ఉంది. దీంతో నగరవాసులు ఏ పని కోసమైనా ఇక్కడికే వస్తుంటారు. పెరుగుతున్న వ్యక్తిగత వాహనాలతో సమస్య మరీ జటిలమవుతోంది. పాతవాహనాలు మరమ్మతు చేసి మళ్లీ ఉపయోగిస్తూ ఉండడంతో కాలుష్య తీవ్రత పెరుగుతోంది. ఈ పనులు అల్లిపురం, నేరేళ్లకోనేరు, చావులమదుం, గోకుల్ థియేటర్ రోడ్డు ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్నాయి. దీంతో ఈ ప్రాంత వాసులు కాలుష్యంతో సతమతవుతున్నారు. ప్రధానంగా నేరేళ్లకోనేరు, గోకుల్ థియేటర్ ఏరియా, చావులమదుం ప్రాంతాల్లో ఆటో టింకరింగ్, రీబిల్డింగ్ పనులు, పెయింటింగ్ పనుల వల్ల ఇబ్బందులు పడతున్నామని స్థానికులు చెబుతున్నారు.



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రద్దీ

ఇరుకు రోడ్లతో ఇక్కట్లు..

పాతనగరంలో నానాటికీ వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటోంది. ఓ వైపు పోర్టు కాలుష్యంతో సతమతమవుతున్న పాతనగర ప్రజలు ఇప్పుడు కొత్తగా వాహనాల వల్ల వాయు కాలుష్యానికి గురవుతున్నారు. పాతనగరంలోని అత్యధిక శాతం మంది శ్వాసకోస వ్యాధులతో బాధపడుతున్నారు.

తల్లిపాలు అమృత సమానం



తల్లిపాల వారోత్సవాలను ప్రారంభిస్తున్న డాక్టర్ సాయి సునీల్‌కిషోర్

దాబాగార్డెన్స్: తల్లిపాలు అమృతం వంటివని, నవజాత శిశువు ఆరోగ్యంగా ఉండేందుకు ఎంతగానో ఉపయోగపడతాయని క్లినికల్ డైరెక్టర్, ప్రముఖ నియోనాటాలజిస్ట్ డాక్టర్ సాయి సునీల్ కిషోర్ తెలిపారు. మెడికవర్ ఉమెన్ అండ్ చైల్డ్ ఆస్పత్రిలో మంగళవారం అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయి సునీల్ కిషోర్ మాట్లాడుతూ తల్లి పాలల్లో వివిధ రకాల పోషకాలుంటాయని, బిడ్డ ఆరోగ్యాన్ని పెంపొందించడమే కాక తల్లీబిడ్డకి మధ్య చక్కని ప్రేమ బంధాన్ని పెంపొందిస్తాయన్నారు. తల్లిపాలు శిశువుకు సులభంగా జీర్ణమవుతాయని, కానీ భారతదేశంలో బ్రెస్ట్ ఫీడింగ్ రేట్ తక్కువగా ఉందన్నారు. కొంత మంది ఆరోగ్య సమస్యల వల్ల బ్రెస్ట్ ఫీడింగ్ చేయలేకపోతున్నారని, మరికొంత మంది బ్రెస్ట్ ఫీడింగ్ పట్ల ఆసక్తి చూపడం లేదన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు డాక్టర్ కె. విజయకృష్ణ, డాక్టర్ జి. మౌనిక, డాక్టర్ ఎ. మౌనిక, డాక్టర్ శ్రీరంగా, డాక్టర్ గీతావందన, విద్యారామ, భూలక్ష్మి, రాధిక, నళిని తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ ఇందిర

బిడ్డకు తల్లిపాలే శ్రీరామరక్ష..

బిడ్డకు తల్లిపాలే శ్రీరామరక్ష అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇందిర పేర్కొన్నారు. పుట్టిన బిడ్డకు వెంటనే తల్లిపాలు పట్టించడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి లభించడంతో పాటు పిల్లల ఆరోగ్యానికి శ్రీరామరక్షలా తల్లిపాలు పని చేస్తాయని తెలిపారు. గొల్లలపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఇందిర మాట్లాడుతూ బాలింతలకు తల్లిపాల ప్రాధాన్యత, ఆవశ్యకత వివరించారు. పుట్టిన బిడ్డలకు ఆరు నెలల వరకు తల్లిపాలు పట్టించడం శ్రేయస్కరమన్నారు. తల్లిపాలల్లో అనేక పోషకాలుంటాయని, బిడ్డ పుట్టిన వెంటనే తల్లికి మొదటిసారిగా వచ్చే పాలని కొలోస్ట్రమ్ అంటారని, ఇది బిడ్డకు చాలా మంచిదన్నారు. బిడ్డకి కావల్సిన ప్రతీది ఈ కొలోస్ట్రమ్‌లో ఉంటుందని తెలిపారు. మొదటి ఆరు నెలలు కేవలం తల్లిపాలు మాత్రమే బిడ్డ తాగినట్టయితే బిడ్డకి అనేక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందన్నారు. చెవి, గొంతు, సైనస్ ఇన్‌ఫెక్షన్స్ నుంచి బిడ్డ కొంచెం పెద్దయ్యే వరకు రక్షణ లభిస్తుందన్నారు.

ఘనంగా శ్రావణలక్ష్మి పూజలు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజలు మంగళవారం రెండవ రోజుకు చేరాయి. గత 18 ఏళ్లుగా అత్యంత ప్రతిష్టాత్మకంగా శ్రీలక్ష్మి పూజలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాద స్వరాల మధ్య శ్రీలక్ష్మి పూజలు ప్రారంభించారు. ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు నిర్వహించి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించాలని ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో వెంపలి రాంబాబు, కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న మునిడిపల్లి రమణ

దాబాగార్డెన్స్: మారుతున్న కాలానికి అనుగుణంగా నాయీ బ్రాహ్మణులు నానాటికీ కులవృత్తులు కోల్పోతున్నారని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మునిడిపల్లి రమణ ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ–ఎ కులాల గ్రూపులో ఉన్న నాయీ బ్రాహ్మణ, రజక కులాలు రాష్ట్రంలో లక్షలాది మంది ఉన్నారని తెలిపారు. ఈ కులాలను ఎంబీసీ కార్పొరేషన్లో కలపవద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంబీసీ కార్పొరేషన్లో కలుపుతారని వచ్చిన సమాచారంతో నాయీ బ్రాహ్మణులు ఆవేదనతో ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వం దీనిని ఉపసంహరించుకోవాలన్నారు. ఈ నిర్ణయాన్ని నాయీ బ్రాహ్మణులు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లయినా ఈ కులాలకు రాజకీయ అవకాశం లేకపోవడం బాధాకరమన్నారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, జిల్లా పరిషత్ వంటి పదవులు పొందలేదన్నారు. ఈ రెండు కులాలు ఎంబీసీలో విలీనమైతే ఇక రాజకీయ పదవులు కూడా రావన్నారు. ప్రస్తుతం నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఏ విధంగా నడుస్తుందో ఆ విధంగానే ఉంచాలని కోరారు. నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్‌ను 1989లో మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు ఏర్పాటు చేశారని, ఈ కార్పొరేషన్ ద్వారా అనేక మంది నాయీ బ్రాహ్మణులు ఉపాధి పొందుతున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బల్లంకి జగన్, తాడితూరి అప్పారావు, మల్లువలస రాదయ్య, బల్లంకి వెంకట్రావు, రాజాన రాముడు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోండి



విరాళాలు సేకరిస్తున్న జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు

దాబాగార్డెన్స్: కేరళలోని వయనాడ్‌లో కొండ చరియలు విరిగి పడిన ఘటనలో బాధిత కుటుంబాలకు సంఘీభావం తెలుపుదాం.. ఉదారంగా విరాళాలిచ్చి ఆదుకుందామంటూ జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది నుంచి జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ మంగళవారం విరాళాలు సేకరించింది. ఈ సంసదర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఘటనలో అనేక మంది మృత్యువాత పడగా, వేలాది మంది నిరాశ్రులయ్యారని, దీనిని జాతీయ విపత్తుగా భావించి కేంద్ర ప్రభుత్వం వెంటనే బాధిత కుటుంబాలను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కేరళ వరద బాధితులు, క్షతగాత్రులు, మృతుల కుటుంబాలను ఆదుకోవల్సిన అవసరం నేపథ్యంలో మానవతా దృక్పథంతో ప్రతి ఒక్కరూ ఉదారంగా విరాళాలిచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో గొల గాని అప్పారావు, ఒమ్మి అప్పారావు, ఈశ్వరరావు, నక్క నాగరాజు, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని ఆందోళన

సీతమ్మధార: రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఏఐఎస్ఎఫ్ విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యంలో ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద వినూత్న రీతిలో కూరగాయలతో విద్యార్థులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా కార్యదర్శి ఉల్లం నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టళ్లలో ప్రస్తుత ధరలకు అనుగుణంగా ప్రతి విద్యార్థికి రూ. 2,500 మెస్ చార్జీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న కాస్మొటిక్ చార్జీలు విడుదల చేయాలని, హాస్టళ్లలో ఖాళీగా ఉన్న వార్డెన్, కమాటి, ట్యూటర్, వాచ్‌మేన్, కుక్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. ప్రైవేట్ పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో 77 రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలన్నారు. ఈ సమస్యలు పరిష్కరించని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని తెలిపారు. అనంతరం కలెక్టర్ ఎం.ఎన్.హరేందిరప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎన్.శ్రీను, జిల్లా సమితి సభ్యులు శేఖర్, గ్రేస్ ప్రకాష్ కిరణ్, మధు, యేసయ్య, నూతన ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

తోపుడు బండ్ల తొలగింపు అన్యాయం

దాబాగార్డెన్స్: హైకోర్టును తప్పుదోవ పట్టిస్తూ కళాభారతి రోడ్డులో గల తోపుడు బళ్లను తొలగించడం అన్యాయమని ప్రముఖ న్యాయవాది పలకా శ్రీరామ్మూర్తి అన్నారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం కళాభారతి తోపుడు బండ్ల సంఘం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 30 నుంచి 40 ఏళ్లుగా చిరు వ్యాపారులు అక్కడ జీవనం సాగిస్తున్నారని, ప్రభుత్వానికి ఆశీలు కూడా కడుతున్నారని చెప్పారు. వారంతా లైసెన్స్ కలిగి ఉన్నారని, అయితే వీరంతా రోడ్డు మార్జిన్ ఆక్రమించారని ఆ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తి హైకోర్టును తప్పుదోవ పట్టిస్తూ ఆర్డర్ తెచ్చారని తెలిపారు. ఆ రోడ్డులో మార్జిన్ లేదన్నారు. లేని మార్జిన్‌కు 188 కోట్లు ఖర్చు చేసినట్టు జీవీఎంసీ పేర్కొందని, ఆ డబ్బులు ఏమయ్యాయని కోర్టులో పిటిషన్ వేయనున్నట్టు తెలిపారు. చిరు వ్యాపారులపై మూర్తి హైకోర్టులో ఏ విధంగా పిటిషన్ వేశారని ప్రశ్నించారు. హఠాత్తుగా నోటీసులు చూపించి దుకాణాలు తొలగించాలంటే, వారంతా ఎక్కడికి వెళ్లిపోతారని మండిపడ్డారు. ప్రభుత్వ అధికారులు, పాలకులు ఈ అన్యాయాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. తోపుడుబండ్ల సంఘం అధ్యక్షుడు బన్నీ మాట్లాడుతూ తాము తొలగించడం లేదని కార్పొరేటర్ మూర్తి, చిరువ్యాపారులు అద్దెకున్న ఇంటి యజమానులతో తమను బెదిరిస్తున్నారని వాపోయారు. సంఘం కార్యదర్శి నిసా మాట్లాడుతూ ఉద్యమానికి నాయకత్వం వహించ వద్దని, తనకు జాతీయ రహదారి పక్కన దుకాణం పెట్టిస్తానని మూర్తి ప్రలోభానికి గురి చేస్తున్నట్టు తెలిపారు. మూర్తిపై సర్వత్రా వ్యతిరేకత వస్తుండడంతో విషయాన్ని పక్కదారి పట్టించేందుకు మాజీ ఎంపీ ఎంవీవీ, జీవీ భూకబ్జాలపై విచారణ చేయాలని మూర్తి ప్రకటన విడుదల చేశారని ఆమె ఎద్దేవా చేశారు. సమావేశంలో వెంకటేశ్వరరావు, దుర్గాప్రసాద్, పలువురు సంఘ సభ్యులు, చిరు వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పలకా శ్రీరామ్మూర్తి

చెత్త సేకరణ పక్కాగా జరగాలి

జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్



కేబుల్ వైర్లను పరిశీలిస్తూ కాల్వలో పడకుండా చర్యలు చేపట్టాలని ఆదేశిస్తున్న కమిషనర్



అధికారులను ఆదేశిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్

దాబాగార్డెన్స్: ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ పక్కాగా జరగాలని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మంగళవారం జోన్–4 పరిధి 28వ వార్డు రామ్‌నగర్, నెహ్రూనగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నివాసిత ప్రాంతాల్లో ప్రతిరోజూ క్లాప్ వాహనాల ద్వారా చెత్త సేకరించాలని, కాల్వల్లో నిత్యం వ్యర్థాలను తొలగించి, మురుగునీరు సాఫీగా పోయేలా చూడాలని జోనల్ కమిషనర్ ప్రసాదరావును ఆదేశించారు. వాణిజ్య సముదాయాలు, దుకాణదారులు కాల్వల్లో చెత్త వేయకుండా డస్ట్ బిన్లు ఏర్పాటు చేసుకుని జీవీఎంసీ చెత్త తరలించే వాహనానికి నేరుగా అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. రోడ్లు, కాల్వలు, బహిరంగ ప్రదేశాల్లో నివాసితులు వ్యర్థాలు వేయకుండా వారంలో ఒకసారి ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమం నిర్వహించాలని, కాల్వల్లో వ్యర్థాలు పేరుకుపోయినందున దోమలు వృద్ధి చెంది సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ తదితర విష జ్వరాలు, వ్యాధులు వ్యాప్తి చెందుతాయని, అందుకు కాల్వల్లో పూడికలతో పాటు ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయించాలన్నారు. నెహ్రూనగర్ దోభీఖానాను ఆనుకుని ఉన్న ప్రధాన కాల్వలో వ్యర్థాలు అధికంగా ఉన్నాయని, వారంలో ఒకరోజు కాల్వలో పూడికలు తొలగించాలని ఏఎంవోహెచ్ డాక్టర్ రాజేష్‌ను కమిషనర్ ఆదేశించారు. నెహ్రూనగర్ ప్రధాన కాల్వను ఆనుకుని ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి పిల్లర్లకు మరమ్మతులు చేపట్టాలని, కాలువలపై ఉన్న పలకలు పూర్తిగా మూసివేయకుండా చెత్త తీసేందుకు వీలుగా పలకలు అమర్చాలని కార్యనిర్వాహక ఇంజినీరు సంతోషిని ఆదేశించారు. పలు చోట్ల కాలువల గుండా తాగునీటి పైపులను గుర్తించి మంచినీటి పైపుల్లోని నీరు కలుషితం కాకుండా నీటిపైపులు క్రమపద్ధతిలో మార్పు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పర్యటనలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఝాన్సీ లక్ష్మి, టీపీవో వినయ్‌ప్రసాద్, సహాయ ఇంజినీర్ జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

నీటి నిల్వలే దోమల ఉత్పత్తికి ఆవాసాలు

మద్దిలపాలెం : ప్రతి మంగళ, శుక్రవారాల్లో ఇళ్లలో నిల్వ నీటిని తొలగించాలని, ఆ నీటి నిల్వలలే దోమల ఉత్పత్తికి ఆవాసాలుగా మారుతాయని జిల్లా మలేరియా విభాగం సబ్ యూనిట్ అధికారి నగేష్ పట్నాయక్ అన్నారు. పాత వెంకోజీపాలెం, మద్దిలపాలెం, రేసపువానిపాలెం అర్బన్ ఆరోగ్య కేంద్రాలలో నిర్వహిస్తున్న డ్రైడే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ నిల్వ నీటిని ఎప్పటికప్పుడు తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వారానికి పైగా ఉన్న నీటి నిల్వలో లార్వా ఉత్పత్తి అవుతుందన్నారు. ఇంటి పరిసరాల్లో ఖాళీ టైర్లు, కొబ్బరి బొండాలు ఉంటే వెంటనే తొలగించాలని సూచించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి పరిసరాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మలేరియా సూపర్‌వైజర్ రత్నం, ఆరోగ్య కార్యకర్తలు రెడ్డి, రామునాయుడు, శ్రీనివాస రెడ్డి, జీవీఎంసీ మలేరియా విభాగం సిబ్బంది, యాంటీ లార్వా బృందం సభ్యులు పాల్గొన్నారు.



వెంకోజీపాలెంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి నగేష్ పట్నాయక్

వైద్యసేవలపై సమీక్ష సమావేశం

సీతంపేట : తల్లిపాలతో పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలని అక్కయ్యపాలెంలోని విద్యుత్‌నగర్ యూపీహెచ్‌సీ వైద్యులు సుధీర్ సూచించారు. ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఆశ డే సమావేశంలో ఆయన మాట్లాడారు. యూపీహెచ్‌సీ పరిధిలో గత నెల రోజులుగా నిర్వహిస్తున్న అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్‌పై సమీక్ష నిర్వహించారు. ప్రతి సచివాలయంలో వ్యాక్సినేషన్‌కు ఎంతమంది అర్హులో గుర్తించారు. అలాగే లెప్రసీ సర్వే, త్వరలో డీవార్మింగ్ మాత్రల పంపిణీ, క్యాన్సర్ సర్వేపై చర్చించారు. ఫ్రైడే డ్రై డే అమలు చేయాలని సిబ్బందికి సూచించారు.

అంకిత భావంతో చదువుకోవాలి



విద్యార్థికి ప్రోత్సాహక సర్టిఫికెట్ అందిస్తున్న ఆర్జేడీ విజయభాస్కర్

ఆరిలోవ: సమాజాభివృద్ధికి ప్రతిభావంతులే పునాది అని విశాఖ ఆర్జేడీ బి.విజయభాస్కర్ అన్నారు. విశాఖ వ్యాలీ స్కూల్‌లో మంగళవారం స్కాలర్ బ్యాడ్జి కార్యక్రమం ఘనంగా జరిగింది. నూరు శాతం హాజరు, మార్కులు సాధించిన విద్యార్థులకు ఆయన బ్యాడ్జీలతో పాటు ప్రోత్సాహకాలు అందించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థి దశ చాలా ముఖ్యమైందన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరి ప్రభాకర్ మాట్లాడుతూ పాఠశాలలో అందిస్తున్న విద్యా విధానం, కల్పిస్తున్న సౌకర్యాలు, ప్రత్యేకతల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.